www.prajasakti.com
ప్రజాశక్తి
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం 13 డిసెంబర్ 2023



తుపాన్ బాధితులకు సాయం

ప్రజాశక్తి - నెల్లూరు అర్బన్ : 24వ డివిజన్‌లో ఇందిరమ్మ కాలనీ ఒకటో డివిజన్ కోడూరుపాడులో 31వ డివిజన్‌లో శివాజీ నగర్ ట్రైబల్స్ కాలనీ చవలపాలెం గంగిరెడ్డల కాలనీ ప్రాంతాలలో మిచాంగ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వం తరపున 2500 రూపాయల ఆర్థిక సహాయంతో పాటు 25 కేజీల బియ్యం ,కూరగాయలు, నిత్యవసర సరుకులను మంగళవారం బాధితులకు అందజేశారు. విజయ డైరీ చైర్మన్ కొండ రెడ్డి రంగారెడ్డి, నగర మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్, ఒకటో డివిజన్ కార్పొరేటర్ జానా నాగరాజుగౌడ్ ఉన్నారు.

సాయం అందజేస్తున్న నాయకులు

అంగన్‌వాడీలకు కనీస వేతనం

రూ. 26 వేలు ఇవ్వాల్సిందే..!

నిరవధిక సమ్మె ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు అంగన్‌వాడీలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె బాట పట్టారని ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.అజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఐసిడిఎస్ పిడి కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నిరవధిక సమ్మె కార్యక్రమంలో పాల్గొన్న అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏదైతే చెప్పారో అంగన్‌వాడీలకు సంబంధించిన హామీలు తక్షణమే అమలు చేయాలని నాలుగు సంవత్సరాలుగా సంబంధిత అధికారులను , మంత్రులు పలుమార్లు విన్నవించుకున్నారన్నారు. దున్నపోతు మీద వర్షం పడిన చందంగా జగన్‌మోహన్‌రెడ్డి క్యాబినెట్ అంగన్‌వాడీల విషయంలో సీత కన్ను ప్రదర్శిస్తుందని విమర్శించారు. అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ. 5లక్షలు అందజేయాలని, మరణించిన అంగన్‌వాడీ కుటుంబంలో అర్హత కలిగిన ఒక్కరికి అవకాశం కల్పించాలని, ప్రభుత్వ పథకాలన్ని అంగన్‌వాడీలకు వర్తింప చేయాలన్న న్యాయమైన కోర్కెలను వైసిపి ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. న్యాయస్థానం ప్రకటించిన విధంగా అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ అమలు చేయాలని, ప్రక్క కేరళ, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలలో అంగన్‌వాడీలకు ఇస్తున్నారని, ఏపిలో ఎందుకు అమలు చేయలేకపోతున్నారో అర్థం కావడం లేదన్నారు. సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌ను సైతం రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఎంత వరకు న్యాయమన్నారు. తాడోపేడో తెల్చుకోనేందుకు అంగన్‌వాడీలు అనివార్యమైనటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెబాట పట్టాల్సి వచ్చిందన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ మాట్లాడుతూ ఎన్నికల ముందు అంగన్వాడి అక్క చెల్లెకు పక్క రాష్ట్రం కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ జీతం ఇస్తానన్న జగన్ మాట తప్పడం అలవాటే కాబట్టి మరొకసారి మాట తప్పాడన్నారు.పక్క రాష్ట్రంలో ఇప్పటికే 14,500 ఇస్తుండగా మన రాష్ట్రంలో ఎటువంటి పెంపు లేకుండా 11500 మాత్రమే ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి జనసేన సంఘీభావం తెలియజేస్తుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నగర కార్యదర్శులు ఎ.కామాక్షి, సంపూర్ణమ్మ నాయకులు జి.నాగేశ్వరరావు, కె.కుమార్, పి.సూర్యనారాయణ, కొండా ప్రసాద్, కత్తి పద్మ ఐద్వా నాయకులు శివకుమారి ఉన్నారు.

నెల్లూరులో అంగన్‌వాడీలనుద్దేశించి మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్‌కె మస్తాన్ బీ

కందుకూరు :అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం కందుకూరు ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రాజెక్టు అధ్యక్షులు రాజేశ్వరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ ప్రాజెక్టు యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్ఎ గౌస్, మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ 26,000 ఇవ్వాలని, గతంలో ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ కార్యదర్శ ఎస్.కె.రముతునీసా మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ రాష్ట్ర కమిటీ జిల్లా కమిటీ పిలుపుమేరకు హాజరు కావాలని కోరారు. అంగన్‌వాడీ ప్రాజెక్టు నాయకులు సరస్వతి ప్రభావతి, ఉమామహేశ్వరి, జరీనా, శశి కేశవ కుమారి, అనురాధ ఉన్నారు.

ఉలవపాడు : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐసిడిఎస్ ఉలవపాడు ప్రాజెక్టు కార్యాలయం వద్ద గుడ్లూరు, ఉలవపాడు లింగసముద్రం మండలాల అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొన్నారు. ఈ ధర్నాలో పాల్గొన్న సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా మొండిగా వ్యవహరిస్తుందన్నారు. సిఐటియు ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం మండలాల సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు సెక్టార్ లీడర్లు సి. హెచ్.ఇందిరావతి, వాణి. లతారెడ్డి,కత్తి. బుజ్జమ్మ బి.మార్త మ్మ ప్రతి తిరుపతమ్మ, ఎస్.కె.పద్మజ,గీత, కామాక్షి,యం. పద్మ,నాగమణి, సిఐటియు ఉలవపాడు మండల కార్యదర్శి ఎస్.డి. గౌస్ భాషా, ఎస్. కే. అమీరున్నీసా, శేషమ్మరమణ ఉన్నారు.

ఉలవపాడులో..

కందుకూరులో...

కావలిలో..

రైతులను ఆదుకోవాలని కోరుతూ

14న కలెక్టరేట్ ఎదుట ధర్నా

సిపిఎం, సిపిఐ నాయకులు

మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు :కేంద్ర ప్రభుత్వం అను సరిస్తున్న విధానాలను ప్రశ్నించలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని అఖిలపక్ష నాయకులు విమర్శించారు. తుపాన్ కారణంగా నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందజేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ ఈనెల 14వ తేదీన వామపక్షాలు, టిడిపి తదితర పార్టీలతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా, పికెటింగ్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక బాలాజీనగర్ ప్రాంతంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో అఖిలపక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ నీటి పారుదల అంశంపై ఈ ప్రభుత్వానికి శ్రద్ధ లేదన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా గాలికొదిలేసిందన్నారు. రైతుల సమస్యలపై గత నెల 21,22,23 తేదీల్లో మూడు రోజుల పాటు కేంద్ర కార్మిక సంఘాలు, వ్యవసాయ, రైతు సంఘాలు సంయుక్తంగా ధర్నా చేపట్టాయన్నారు. అయినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. సరైన వర్షాపాతం నమోదు కాకపోవడం వల్ల జిల్లాలో పలు మండలాలు కరువుతో విలవిలలాడుతు న్నాయన్నారు. వాటిని రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. సిపిఐ, సిపిఎం వివిధ సందర్భాల్లో రైతుల సమస్యలపై పోరాటాలు చేశాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రజా ఉద్యమాల ద్వారానైనా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం తెప్పిద్దామని ఆలోచనతో ఈ నెల 11వ తేదీన 26 జిల్లాల్లో రాష్ట్ర వ్యాప్తంగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించామన్నారు. ఈ నెల 14వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా ,పికెటింగ్ కార్యక్రమాలకు పిలుపునిచ్చామన్నారు. రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి కరువును నిజాయితీగా అంచనా వేయాలన్నారు. ఎకరాకు మామూలు పంటలకు రూ.50 వేలు, వాణిజ్యపంటలకు రూ.75 వేలు, వనాలకు ఒక లక్ష నష్టపరిహారంగా అందజేయాలన్నారు. వ్యవసాయకార్మికలకు 200 పనిరోజులు కల్పించాలన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్ల రైతాంగం పూర్తిగా నష్టపోయిందన్నారు.నాయకులు చంద్ర రాజగోపాల్, ఎం.మోహన్‌రావు, షాన్‌వాజ్, టిడిపి విభాగం రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుడ్లూరు సిఐకి అవార్డు

గుడూరు :ఎస్‌పి నిర్వహించిన వార్షిక క్రైమ్ మీటింగ్ లో గుడ్లూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ పి సుబ్బారావ్‌కి మిచాంగ్ తుఫాన్ సమయంలో ఉత్తమ సేవలం దించినందుకు గానూ, తన సర్కిల్ పరిధిలో దొంగతనం కేసులను ఛేదించి నింది తులను అరెస్ట్ చేసి సొమ్ము రికవరీ చేసినందుకు గానూ అవార్డు అందుకున్నారు. ఎస్‌పి తిరు మలేశ్వర రెడ్డి ఆయన్ను అభినందించారు. బెస్ట్ పర్ఫార్మన్స్ అవార్డును అందజేశారు.

సభ్యత్వ నమోదు ప్రారంభం

నెల్లూరు : నగరంలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద సిఐటియు కమిటీ ఆధ్వర్యంలో లైన్ ఆటో సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్యాంసన్, ఎం.సుధాకర్‌లు మాట్లాడారు.ఆర్‌టిసి ఆటో స్టాండ్ అధ్యక్షులు టి.వెంకి, కార్యదర్శి బి.సుధాకర్, ఎస్.కుమార్, రత్నం, మహేష్, శైలేష్ ఉన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

21 నుంచి సమ్మెలోకి..

ప్రజాశక్తి-నెల్లూరు : సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీల మేరకు పర్మినెంట్ చేయకపోవడాన్ని నిరసిస్తూ నెల 21వ తేదీ నుంచి నిరవధిక సమ్మెబాట పట్టనున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఎబిఎం కాంపౌండ్ నుంచి విఆర్‌సి సెంటర్ వరకు మున్సిపల్ కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా నగర పాలక సంస్థలోకార్మికులుగా పనిచేస్తు, చాలీ చాలనటువంటి జీతాలతో జీవనం సాగిస్తున్న మున్సిపల్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మరో నాలుగు నెలల్లో తిరిగి అసెంబ్లీకి ఎన్నికలు రాబోతున్నపట్టికి ముఖ్యమంత్రిగా మున్సిపల్ కార్మికులను గానీ, కాంట్రాక్టు , ఔవుట్ సోర్సింగ్ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకపోవడం వారిని మోసగించడమేనన్నారు.ఈ సమస్యపై స్పందించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేది నుంచి నిరవధికంగా సమ్మెబాట పడతామని హెచ్చరించారు. ఇంకా సిఐటియు నగర కార్యదర్శి జి. నాగేశ్వరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్ బి తదితరులు పాల్గొని ప్రసంగించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి. సూర్యనారాయణ,డివైఎఫ్ఐ నెల్లూరు నగర కార్యదర్శి బీపీ నరసింహ,ఐద్వానగర కార్యదర్శి కత్తి పద్మ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.అశోక్,ఆర్ ఏం సునీల్,ఎం శ్రీనివాసులు, భాగ్యమ్మ,కొండమ్మ కామాక్షమ్మ,సలోమి, లోకేష్, జయకుమార్, నాగేశ్వరావు ఉన్నారు.

ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లూరు అర్బన్ :నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 41వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్లో జరుగుతున్న అభివద్ధి నిర్మాణ పనుల్లో భాగంగా సిసి రోడ్డు నిర్మాణ పనులకు నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డిలి ఆదేశాల మేరకు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డిలి 41వ డివిజన్ కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మి, డివిజన్ అధ్యక్షులు కువ్వాకొల్లు బాబ్జి యాదవ్ లతో కలసి 41 వ డివిజన్లోని మహేశ్వరి నగర్‌లో రూ. 35 లక్షల నిధులతో నిర్మించునున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనచేశారు. కార్యక్రమంలో కమలాకర్, ఏలూరు గోపి, ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఏడుకొండలు ఉన్నారు.

అంగన్‌వాడీల ధర్నాకు మద్దతు

ప్రజాశక్తి -నెల్లూరు అర్బన్ : సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం పీడీ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. ఈ ధర్నాకు జనసేన పార్టీ తరపున జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ హాజరై అంగన్‌వాడీల ఆందోళనకు మద్దతు తెలిపారు.

వైసిపి జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - నెల్లూరు అర్బన్ : 29వ డివిజన్‌లోని 29/2 సచివాలయ పరిధిలోని మహత్మ గాంధీ నగర్ పార్క్ వద్ద “వై నీడ్ ఏపీ జగన్” పేరిట జరిగిన కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైసిపి జెండాను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న 29వ డివిజన్ కార్పొరేటర్ గారు షేక్ సత్తార్, పార్టీ డివిజన్ అధ్యక్షులు.సాయి రెడ్డి, కార్యవర్గ సభ్యులు సి.హెచ్. సూరిబాబు, బారాషాహిద్ దర్గా చైర్మన్ ఇస్మాయిల్ ఖాదిరి, పట్టాభిరామిరెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

పొదలకూరు :మండలంలోని ఆల్తుర్తి గ్రామంలో మంగళవారం మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆదేశాలతో తుపాన్ బాధితులకు నిత్యావసర సరకులు పంపిణీ చేసినట్లు ఉప సర్పంచ్ ఖాదర్ బాషా తెలిపారు. బియ్యం, నూనె, కందిపప్పు, ఎర్రగడ్డలు, ఉర్లగడ్డలు, అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో విఆర్‌ఒ సురేష్, డీలర్ పచ్చురు ప్రసన్న ఉన్నారు.

రహదారిపై కట్టెల లోడింగ్

ప్రజాశక్తి -పొదలకూరు : పొదలకూరు పట్టణంలోని నెల్లూరు రూట్, మనుబోలు రోడ్లపైనే కట్టేలు, పెద్ద పెద్ద మానులు పడేస్తున్నారు. లారీలకు లోడింగ్, అన్ లోడింగ్, చేస్తున్నప్పుడు పొదలకూరు నుంచి నెల్లూరు నుండి పొదలకూరు మార్గమధ్యలో గూడూరు నుంచి పొదలకూరుకు, పొదలకూరు నుంచి గూడూరు, మనుబోలు, వెళ్లే వాహనాలు దారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రోడ్లపై లోడింగ్, అన్లోడింగ్, చేయకుండా చూడాలని పట్టణ వాసులు, వాహనదాఉలు కోరుతున్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని ఖాజీపాలెం కు చెందిన షేక్ ఖాసింసాహెబ్, రహీమున్నీసా కుమారుడు షేక్ అబ్దుల్ కలీమ్ వలిమా కార్యక్రమం పోతురాజుమిట్ట వద్దగల షాదీఖానాలో మంగళవారం జరిగింది. కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ సలాం, వార్డు అధ్యక్షుడు షేక్ ఖలీల్, షేక్ ఇక్బాల్ అహ్మద్, అమిరుల్ల, హాజీ, అలిం,రజాక్, సలాం, అయాజ్ ఖాన్, ఫాజిల్ ఉన్నారు.

ఆశా వర్కర్ల ధర్నా

తోటపల్లిగూడూరు : ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ వద్ద ఈ 14, 15 తేదీలలో జరిగే 36 గంటల ధర్నాను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ట్రెజరర్ మధుసూదనమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం ఇక్కడ జరిగిన ధర్నాలో ఆమె మాట్లాడారు. ధర్నా అనంతరం ప్రభుత్వం దిగిరాకపోతే ఆందోళనను ఉదతం చేస్తామని ఆమె హెచ్చరించారు.కోడూరు పిహెచ్‌సి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాటం

ప్రజాశక్తి నెల్లూరు అర్బన్

రాష్ట్ర ప్రయోజనాల కోసం జనసేన, టిడిపి పనిచేస్తున్నాయని ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు కలిసి నిలబెట్టే అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరముందని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పేర్కొన్నారు. మాజీ మంత్రి నారాయణ సతీమణి రమాదేవి మంగళవారం నెల్లూరు నగరంలోని కింగ్స్ కోర్ట్,ఎగ్జాటికా గార్డెన్స్‌లో మహిళా చైతన్య వేదిక ఏర్పాటు చేశారు. ఈ కార్యరకమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు. వారి మనోభావాలను పంచుకున్నారు.

పలుచోట్ల ‘బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారెంటీ’

కందుకూరు : పట్టణంలోని 7వ వార్డులోని విక్కిరాలపేట రోడ్డు, విజయ బాలాజీ కళ్యాణ మండపం, తూర్పు ఏరియాలో కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం పర్యటించారు. ఇంటింటా తిరుగుతూ పార్టీ మినీ మేనిఫెస్టో కరపత్రాను ప్రజలకు పంపిణీ చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, వార్డు అధ్యక్షుడు గౌస్ బాషా, రూబీ, ఖాదర్ బాషా, ఖలీల్, యూనిస్, వహీద్ ఉన్నారు.

తోటపల్లిగూడూరు :కాకాణి గోవర్ధన్ రెడ్డికి వ్యవసాయ శాఖ మంత్రి పదవి రావడంతో వైసిపిలో రాజీనామాల పర్వం మొదలైందని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం తోటపల్లి గూడూరు మండలం వరకవిపూడి గ్రామంలో “బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ” కార్యక్రమం జరిగింది. టిడిపి మండల అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు.ఆయన మంత్రి కాకాణిపై, ఘాటు విమర్శలు సంధించారు. వెంకటాచలం, ముత్తుకూరు, టిడిపి అధ్యక్షులు రాజా యాదవ్, రామ్మోహన్ రెడ్డి, నెలుపూడి సుధాకర్, సోమిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కొణతం రఘుబాబు, సన్నారెడ్డి శ్రీధర్ రెడ్డి, కోడూరు శ్రీనివాసరెడ్డి, ఇంగిలేల వెంకట చైతన్య కుమార్, వెలసిరి కోటేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

ఉలవపాడు : బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం లో భాగంగా మంగళవారం ఉలవపాడు లోని కొత్తూరు మసీదు ప్రాంతంలో టిడిపి కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరావు పాల్గొని మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షులు వాసు, దార్ల ఎలమందమ్మ, ఎండి కరీం, వెల్డింగ్ ఖాదర్ బాషా, ఎస్కే బాజీ, తొట్టెంపూడి మాలాద్రి, చింతల సింగయ్య, చింతలగిరి బాబు, దార్ల మల్లికార్జున, జంగాల శివప్రసాద్, చింతల వెంకటేశ్వర్లు గంట కష్ణ బడితల సాంబయ్య ఉన్నారు.

కందుకూరులో..

నెల్లూరు సిటీ : వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటమి ఖాయమని మాజీ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గం 4వ డివిజన్‌లోని జాకీర్ హుస్సేన్ నగర్, వాటర్ ట్యాంక్ తదితర ప్రాంతాల్లో బాబు షఉరిటీ –భవిష్యత్‌కు గ్యారె ంటీ మంగళవారం ఆయన నిర్వహించారు.

తోటపల్లి గూడూరులో..

కామాక్షినగర్‌లో అసాంఘిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :మండలంలోని తోటపల్లి పంచాయతీ కామాక్షి నగర్‌లో ఇటీవల నుంచి అసాంఘిక కార్యక్రమాలు పెరిగాయి. నిన్నమొ న్నటి వరకు ఎంతో ప్ర శాంతం గా ఉండే ఆ కామాక్షినగర్‌లో ప్రస్తుతం నేరాలు, ఘోరాలు, ఆన్‌లైన్ బెట్టింగులకు అడ్డాగా మారింది. తోటపల్లిగూడూరు గ్రామానికి చెందిన ఆకతాయిలు అల్లరి మూకలతో కలసి ప్రభుత్వ జూనియర్ కాలేజ్ విద్యార్థినుల పట్ల ద్వందార్థాలతో ఇబ్బంది పెడుతున్నట్లు తెలిసింది.ఆ అల్లరి మూకలకు బయపడి బాలికలు మౌనంగా కుమిలి పోతున్నాని చెబుతున్నారు. ఆ ప్రాంతంలో గంజాయి వి క్రయాలు కూడా జోరుగా సాగుతోందాన్న ప్రచారం జరుగుతోంది.ఆ ప్రాం తంలో మత్తుప దార్థాల విక్రయాలు జరుగుతు న్న విషయం ప్రచారంలో ఉన్నప్పటికీ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో (సెబ్) అధికారుల్లో ఏమాత్రం చల నం కనిపించక పోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఆకతాయిల అల్లర్లు హద్దు లు మీరుతుండడంతో ప్రజలు, మహిళలు భయాందోళనలకు గురౌతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

ఆటల పోటీల నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి-ఉలవపాడు : మండల పరిధిలో ఏ సచివాలయంలో ఆడుదాం ఆంధ్ర ఆటలు జరగలేదని తన దృష్టికి వస్తే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయని కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక పేర్కొన్నారు. మంగళవారం ఉలవపాడు మండలం పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి సర్పంచులు, సచివాలయ కార్యదర్శులకు, ఎఎన్‌ఎంలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపిడిఒ ఎల్ చెంచమ్మ, తహశీల్దార్ ఆర్ బ్రహ్మయ్య, ఎంపిపి మస్తానమ్మ, ఎంఇఒ పివి ప్రసాద్ రావు, మండల స్థాయి సర్పంచులు, సచివాలయ కార్యదర్శులు, ఏనుములు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాలు పంపిణీ

కలువాయి :కలవాయిలోని ఉమామహేశ్వరి కళ్యాణ మండపంలో అసైన్డ్ భూములకు సాగు చేసుకుంటున్నా రైతులకు చుక్కల భూములకు హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో నిధులు రాంకుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జెసిఎస్ మండల కన్వీనర్ మాదాసు యజ్ఞ పవన్, వైసిపి మండల కన్వీనర్ కష్ణారెడ్డి, తహశీల్దార్ స్వర్ణ, ఎంపిడిఓ గోవర్ధన్ ఉన్నారు.

నాణ్యమైన పాల దిగుబడికి చర్యలు

ప్రజాశక్తి-కందుకూరు : ప్రతి నెల మంగళవారం పశు విజ్ఞాన బడి ఆర్‌బికెలలో నిర్వహిస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ డివిజనల్ ఉపసంచాలకులు డాక్టర్ చెరుకూరు చంద్రశేఖర రావు పేర్కొన్నారు. కందుకూరు మండల పరిధిలోని మాచవరం, పాలూరు , కోవూరు గ్రామాలలో పశు విజ్ఞాన బడి కార్యక్రమం మంగళవారం జరిగింది. చంద్రశేఖర్ మాట్లాడుతూ పరిశుభ్రమైన పాల ఉత్పత్తి కోసం పశు పోష కులు తీసుకోవాల్సిన మెలుకువలు, లేగ దూడలు పట్ల చలి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులు తెలిపారు. మాచవరం పశు వైద్యులు ఇ.చెన్నకేశవులు, కోవూరు పశు వైద్యులు ఎస్. సుధాకర్ పశు వైద్య సహాయకులు, పి .విజయ , జి. విజయ్ సాగర్ ఉన్నారు.

పేదల సంక్షేమానికి కృషి : వైసిపి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :వైసిపి ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని, పేదల సంక్షేమానికి పాటు పడుతుందని వైసిపి మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్ పేర్కొన్నారు. మంగళ వారం మండలంలోని మాచర్లవారి పాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. అభివద్ధి అధికారి ప్రత్యూష రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రమంలో, మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పల శంకరయ్య గౌడ్, జగనన్న సచివాలయ కమిటీ ఇంచార్జ్ తలమంచి సురేంద్ర బాబు గ్రామ నాయకులు మరియు కన్వీనర్లు, వాలంటీర్లు, గ్రుహ సారధులు, గ్రామ ప్రజలు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా శంకరయ్య గౌడ్ మళ్లీ జగనే సీఎం కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



తోటపల్లి గూడూరులో..

ఉలవపాడు : మా నమ్మకం నువ్వే జగనన్న; ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాలు ఆత్మకూరు గ్రామ సచివాలయం పరిధిలో జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యాలయంలో సంక్షేమ పథకాల డిస్ప్లే బోర్డును ఆవిష్కరించారు. వైఎస్‌ఆర్సిపి పార్టీ జెండా ఆవిష్కరించి ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్ పార్టీ మండల అధ్యక్షుడు నన్న పోతురాజు, జెసిఎస్ మండల కన్వీనర్ వెలిచెర్లధనకోటి, మండల కోఆప్షన్ సభ్యులు ఎస్.కె ఖాదర్ బాషా, గ్రామ నాయకులు చేజర్ల వెంకట్రామిరెడ్డి, వై రాఘవరెడ్డి, మహంకాళి భీమయ్య ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కందుకూరు : బద్వేల్ సమీపంలోని సెంచరీ ప్యానెల్స్ ఆధ్వర్యంలో కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని చుట్టుగుంటలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కంపెనీ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కంపెనీ ప్రతినిధులు మాట్లాడారు. సెంచరీ ప్యానెల్స్ ద్వారా ఈ ప్రాంతంలో మూడు వేల ఎకరాల్లో జామాయిల్ సాగు చేపట్టామన్నారు. రైతులకు రెండు రూపాయల సబ్సిడీతో నాణ్యమైన మొక్కలను అందచేస్తున్నట్లు తెలిపారు. నెల్లూరు అపోలో హాస్పిటల్స్ వైద్యులు చుట్టుగుంట, పరిసర గ్రామాల రైతులు ప్రజలకు వైద్య పరీక్షల నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. సెంచరీ కంపెనీ ప్రతినిధులు రమణ, విశ్వనాథరెడ్డి, కష్ణ సందీప్, రమేష్ రెడ్డి, కష్ణ, రైతు ప్రతినిధులు కంద్రా చినమాలకొండయ్య, కంద్రా మాల్యాద్రి, ఎ. శ్రీహరి ఉన్నారు.

పోస్టల్ ఉద్యోగుల సమ్మె

గుడ్లూరు :ఆల్ ఇండియా పోస్టల్ ఉద్యోగుల యూనియన్ పిలుపుమేరకు గుడ్లూరు పోస్టల్ కార్యాలయం దగ్గర ఉద్యోగులు నిరవధిక సమ్మె మంగళవారం ప్రారంభించారు. తమ కనీస హక్కులు సాధించేవరకు సమ్మె కొనసాగుతుందని ఉద్యోగులు తెలిపారు. దీంతో పోస్టల్ లావాదేవీలు నిలిచిపోయాయి.

ఆశా వర్కర్లకు అవగాహన

గుడ్లూరు :మండలంలోని అన్ని గ్రామాల్లో ఐదేళ్ల లోపు చిన్నారుల ఆరోగ్య రక్షణ కోసం ప్రత్యేక సర్వే చేయాలని వైద్యాధికారి డాక్టర్ మారుతీ రావు ఆశా వర్కర్లను ఆదేశించారు. స్థానిక వైద్య ఆరోగ్య కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రత్యేక సమావేశహాలులో ఆశ వర్కర్లకు అవగాహన సమావేశం మంగళవారం జరిగింది. దగ్గు, జలుబు ,జ్వరము తోటి శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది పడుతున్న చిన్నారుల్ని గుర్తించి వెంటనే సమాచారం పంపాలని వైద్యాధికారి ఆశ వర్కర్లను ఆదేశించారు. ఆశా వర్కర్లు ఏఎన్‌ఎంలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

-తోటపల్లి గూడూరు :మతోన్మాదాన్ని కూకటి వేళ్లతో సహా నిర్మూలించడమే జై భారత్ ముఖ్య లక్ష్యం అని ఆ సంస్థ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞా సిలోక్ నాథ్ పేర్కొ న్నారు. మంగళవారం అయన తోటపల్లిగూడూరు సచివాలయం వద్ద జైహెూ 2వ జాతీయ సమ్మేళనం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఖదిజ్ఞాసి లోక్ నాథ్ మాట్లాడారు. జైభారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసి లోక్ నాథ్, జైభారత్ జాతీయ కార్యవర్గ సభ్యులు కార్తికేయ పోలవరపు, జైభార త్ ఎస్సీ పోరాట వేదిక రాష్ట్ర కార్యదర్శి ఖదిజ్ఞాసి శ్యాంసుందర్, జైభారత్ ఎస్సీ పోరాట వేదిక తిరుపతి జిల్లా అధ్యక్షులు ఖదిజ్ఞాసి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎంపిటిసి

ప్రజాశక్తి -వలేటివారిపాలెం :పేదల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని పోలినేని పాలెం ఎంపిటిసి చింతలపూడి రవీంద్ర పేర్కొన్నారు. మంగళ వారం సర్పంచ్ అధ్యక్షన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రవీంద్ర పాల్గొని మాట్లాడారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదలకు అందజేస్తున్న నవరత్నాలలో పేదలందరికీ మెరుగైన జీవన ప్రమాణాల కల్పన జరుగు తుందన్నారు. సామాజిక న్యాయ విధానంలో బిసి, ఎస్సి, ఎస్టి, మైనార్టీలకు సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నిక కావాల్సిన అవసరముందన్నారు. ఇంకా ఈ సమావేశానికి జడ్పిటిసి ఇంటూరి భారతి, వైసిపి అధ్యక్షులు పరిటాల వీరాస్వామి, అనుములు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.చుండి ఎంపిటిసి సవడబోయిన యానాది సర్పంచ్ సతీష్ గురజాల కిష్టయ్య ప్రసాదు దుగ్గిరాల నవీన్ శివరామయ్య ఎల్‌ఐసి మాల్యాద్రి వైసిపి సీనియర్ నాయకులు ఇంటూరి హరిబాబు దేగ బుజ్జి ఉన్నారు.

మాట్లాడుతున్న ఎంపిటిసి చింతలపూడి రవీంద్ర

విద్యాహక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల బాలికల ఉన్నత పాఠశాలలో మానవ హక్కులు - విద్యాహక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి మండల లోక్ అదాలత్ లీగల్ ఎయిడ్ మెంబర్ ఐ.సాయి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై అక్కడ ఉన్న బాలికలకు కొన్ని చట్టాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో చెడు ప్రభావాలను విడిచి మంచిగా మెలగాలని తెలిపారు. 12సంవత్సరాల లోపు పిల్లలు అందరూ పాఠశాలలకు వెళ్లి బాగా చదువుకోవాలన్నారు. పాఠశాల స్థాయి నుంచి క్రమ శిక్షణ కలిగి బాగా చదువుకుని మంచి ఉద్యోగాలు పొంది సామాజిక స్పృహ కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ

ప్రజాశక్తి-కావలి : కావలి వెంగళరావు నగర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలకు బీరువా అవసరం అని తర్జన భర్జనలు పడుతూ ఉంటేఅక్కడ జీవ శాస్త్ర ఉపాధ్యాయులు ఎస్‌కె.అంజాద్ అలీ గమనించి వారి తండ్రి అసఫ్ అలీ జ్ఞాపకార్థం సుమారు రూ.10వేలు విలువ చేసే బీరువాను మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ హయ్యూల్ హయ్యూమ్‌కు అందించారు. ఈ సందర్భంగా అజాద్‌అలీ సేవాదృక్పథాన్ని ప్రధానోపాధ్యాయులు కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సీనియర్ ఉపాధ్యాయులు బి.శాంత కుమారి, బి.శర్వాణి, ఐ.శ్రీనివాసులు, తెలుగు ఉపాధ్యా యులు వై.రజనీ, ఎన్‌సిసి కేర్ టేకర్ టి.కొండారెడ్డి, ఆంగ్ల బోధకులు షేక్.సాబిరా బేగమ్ హిందీ బోధకులు కె.విజయలక్ష్మి, సుబ్బయ్య, యేసురత్నం, మహబూబ్, మస్తాన్, జయప్రకాష్, కనకలక్ష్మి, మారమ్మ, బోధనేతర సిబ్బంది పాల్గొని అభినందనలు తెలియజేశారు.

వైద్య సేవలను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ట్రైనీ కలెక్టర్ సంజనా సింహ ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, సదుపాయాలు, తదితర విషయాలపై శిక్షణలో భాగంగా నిశిత పరిశీలన చేపట్టారు. ముందుగా ఎక్స్‌రే రూమును పరిశీలించి రోజుకు ఎంతమంది ఎక్స్‌రే కోసం వస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్‌లో పరీక్షలకు ఒక్కొక్క దానికి ఎంత సమయం పడుతుందని, రోజుకు ఎన్ని పరీక్షలు నిర్వహిస్తారని అడిగి తెలుసుకున్నారు. ఆమెతోపాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పెంచలయ్య, డిసిహెచ్ కూడా పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటేశ్వర్లు గౌడ్, ఆయుర్వేద వైద్యులు ఉన్నారు.

ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కావలి : ఆర్.టి.సి. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక ఆర్.టి.సి. డిపో ఎదుట ఎస్.డబ్ల్యు.ఎఫ్. ఆధ్వర్యంలో ఆర్.టి.సి. కార్మికులు ధర్నా చేశారు. ఆర్.టి.సి. కార్మికులకు బదిలీలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత అమలు చేయాలని, 2017పి.ఆర్.సి. చెల్లించాలని, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాలని, అనారోగ్యంతో ఉన్న కార్మికులకు "రిఫరల్ హాస్పిటల్" సౌకర్యం కల్పించాలని, రిటైర్ అయిన ఉద్యోగులకు సెటిల్‌మెంట్లు చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జిల్లా అడ్వైజర్ ఈ.బి.ఎస్.మణ్యం, డిపో అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు, కార్యదర్శి బి.ఆర్.ఎస్. రెడ్డి, గారేజ్ సెక్రెటరీ ఎస్.కె.ఎ.కలాం, ప్రెసిడెంట్ పి.వి.రావు, కార్మికులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం..

ప్రజాశక్తి-వరికుంటపాడు : వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా కొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన వరికుంటపాడు సమీపంలో 565 జాతీయ రహదారిపై సోమవారం రాత్రి 12 గంటలకు చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కడపకు చెందిన ఇంటెల్లు విజయ్ కుమార్ విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా డ్రైవర్ నిద్ర మత్తులో జారుకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో విజయ్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని కార్లో నుండి తీసి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన ఘటనపై విచారిస్తున్నారు.

నేడు 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని తిమ్మారెడ్డిపల్లి సచివాలయ పరిధిలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనున్నట్లు మండల కన్వీనర్ మందలపు తిరుపతి నాయుడు మంగళవారం ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని వైసిపి నాయకులు అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి-ఉదయగిరి : ఘనంగా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని దళితవాడ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దళితవాడ పాఠశాలలోని భవిత సెంటర్‌లో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారులైన షేక్ మస్తాన్ వలి, తోట శ్రీనివాసులు మాట్లాడుతూ వికలాంగులు సకలాంగుల కంటే అన్ని రంగాలలో గొప్పవారని, శారీరక, మానసిక వికలాంగులు అనుకున్నదల్లా సాధించగలరని అన్ని రంగాలలో రాణించగలరన్నారు. అనంతరం ఆటల పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ షబ్బీర్, కలీం, ఐ ఆర్ టి లీవర్ సుభాష్ చంద్రబోస్, శివ నందిని పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు మిఠాయిలు పంపిణీ

ప్రజాశక్తి-విడవలూరు : మాజీ మంత్రి, కోవూరు ఎంఎల్‌ఏ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం నెల్లూరు నగరంలో ఉన్న వాత్సల్య అనాథ శరణాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. విడవలూరు మండలం సచివాలయం కన్వీనర్ నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు మిఠాయిలు చాకొలెట్స్, అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైసిపి ప్రధాన కార్యదర్శి పూండ్ల.అచ్యుత్ రెడ్డి, వైసిపి విడవలూరు మండలం కన్వీనర్ బెజవాడ గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-విడవలూరు : వరదముంపునకు గురైన పంటలను నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా విత్తనాలను పంపిణీ చేసినట్టు జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్ రెడ్డి అన్నారు. మంగళవారం విడవలూరు ఆర్‌బికెలో రైతులకు 80శాతం రాయితీతో వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూండ్ల మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డితోనే రైతులకు మేలు జరిగిందన్నారు. మండలంలో నష్టపోయిన రైతులకు సత్వరమే విత్తనాలు పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వెంకట కృష్ణయ్య, మండల సచివాలయం కన్వీనర్ నవీన్ రెడ్డి, కన్వీనర్ గోవర్ధన్ రెడ్డి, ఉప్పలమర్తి రవీంద్ర రెడ్డి, స్థానిక రైతులు పాశం శ్రీహరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-కోవూరు : విజయనగరం జిల్లాకు చెందిన ఎంఎల్‌సి ఇందుకూరు రఘురామరాజు ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా ఉండాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కల్యాణ్ విజయనగరం నుండి తిరుమల వెంకన్న వద్దకు జయహో జగన్ పాదయాత్ర మంగళవారం కోవూరులోకి ప్రవేశించింది. 820 కిలోమీటర్ల మేర 43 రోజుల పాటు సాగనున్న ఈ పాదయాత్రకు కోవూరు ఊర అభిమానులు, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నలుబోలు సుబ్బారెడ్డి, ఎంపిపి చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. షిరిడి సాయి మందిరంలో ఆలయ ధర్మకర్త రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాదయాత్రతో కోవూరు పురవీధుల్లో బయల్దేరిన ఈ ర్యాలీకి పార్టీ నాయకులు కార్యకర్తలు పూలవర్షం కురిపిస్తూ భారీ స్వాగతం పలికారు. అనంతరం స్థానిక సాయిబాబా సెంటర్లో మండల పార్టీ కన్వీనర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి కోవూరు ఎంఎల్‌ఏ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నలుబోలు సుబ్బారెడ్డి, కోవూరు ఎంపిపి చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జెడ్‌పిటిసి శ్రీలత, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఇంతా మల్లారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, డిఎల్‌డిఎ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, గంగవరం సర్పంచ్ లక్ష్మీకాంతం, సచివాలయాల కన్వీనర్ ప్రసాద్ తదితరులున్నారు.

పూరిగుడిసె దగ్ధం

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలోని 18వ వార్డులోని దుద్దు వరలక్ష్మి అనే మహిళ ఇంట్లో దీపారాధన చేసి, గుడికి వెళ్లిన సమయంలో దీపం అంటుకుని పూరిగుడిసె అగ్నికి ఆహుతైంది. ఆమె కట్టుబట్టలతో ఇద్దరు చిన్నారులతో నిరాశ్రయులైంది. అగ్నిమాపక దళం వచ్చి, మంటలను ఆర్పారు. అగ్ని నష్టం వివరాలు తెలియరాలేదు.

అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

ఉదయగిరిలో నిరవధిక సమ్మె చేపడుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

ప్రజాశక్తి-ఉదయగిరి : సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ అంగన్‌వాడీ వర్కర్స్ వెల్ఫేర్ సమస్యల పరిష్కారంతోనే చేపట్టిన సమ్మె ఆగబోతుందని సిఐటియు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుండి ర్యాలీగా బయల్దేరిన అంగన్‌వాడీ కార్యకర్తలు సిడిపిఒ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేసి సమ్మె చేపట్టారు. మాట ఇచ్చిన జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అంగన్‌వాడీలకు వేతనాలు చెల్లించాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం గ్రాడ్యుయేట్ ఇవ్వాలన్నారు. యాప్‌ల పని భారం తగ్గించి భద్రత కల్పిం చాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందిం చి అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించా లని యూనియన్ తరఫున డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్ రజియా, మహాలక్ష్మి, ప్రమీల, రమాదేవి, సిపిఎం మండల కార్యదర్శి ఫర్దిన్ బాషా, సిఐటియు నాయకులు నాగేశ్వరరావు, కోడే రమణయ్య, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : అంగన్‌వాడీలకు తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ అమలు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి కొండమూరి హాజరత్తయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరు ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్స్ తమ సమస్యలు పరిష్కారం కోసం నిరవధిక సమ్మెకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సమ్మె నిర్వహించారు. సమ్మెకు వెళ్తున్నట్లు అల్టిమేట్ అందజేసినప్పటికీ ప్రభుత్వం చర్చలకు పిలిచి తమ సమస్యలను పరిష్కరించే దిశగా స్పందించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె వెళ్తున్నట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.రాధమ్మ మాట్లాడుతూ ఇవాళ ఆత్మకూరు పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ప్రాజెక్టులోని వర్కర్లు, హెల్పర్లు, అందరూ సమ్మెలో పాల్గొన్నారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26వేలు ఇచ్చేంతవరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, జిల్లా కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షుడు గంట లక్ష్మీపతి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ సెక్టర్ లీడర్లు కె.రమణమ్మ, ఆర్ సుప్రజ, ఎస్ విజయమ్మ, పుష్పకళ, మస్తానమ్మ, రూతమ్మ, వెంకటరమణమ్మ, విజయభారతి, భాగ్యలక్ష్మి, వేణుమాధవి, జమీల, ఆత్మకూరు, ఎఎస్‌పేట సంగం, చేజర్ల, అంగన్‌వాడీలు హెల్పర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : అంగన్‌వాడీ అక్కాచెల్లెమ్మలకు తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచుతానన్న ముఖ్యమంత్రి హామీ నీటిమీద రాతలుగా మిగిలిందని 2022లో సుప్రీంకోర్టు అంగన్ వాడీలకు గ్రాడ్యూటీ అమలు చెయ్యాలని ఇచ్చిన తీర్పు నేటికీ రాష్ట్రంలో అమలు చెయ్యడం లేదని సిఐటియు జిల్లా కార్యదర్శి పెంచలయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీసెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చలేదని హెల్పర్ల ప్రమోషన్లకు ఎటువంటి నిబంధన రూపొందించలేదన్నారు. సమ్మెలో గోనె దయాకర్, సుజాతమ్మ, ఎల్ వి శేషమ్మ, విజయమ్మ, నరసింహులు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : అంగన్‌వాడీల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలం కావడంతో అంగన్ వాడీ వర్కర్లు హెల్పర్లు తమ సెంటర్లను మూసివేసి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగారు. దానిలో భాగంగా మంగళవారం అనంతసాగరం ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద అనంతసాగరం, మర్రిపాడు మండలాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు నిరసనకు దిగారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి అన్వర్ బాషా, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు నాగమణి పాల్గొని మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చమని అడుగుతున్నామే తప్ప ఎలాంటి గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు లక్ష్మి, సునీత, వసంత, నూర్జహాన్, భాగ్యమ్మ, మర్రిపాడు, అనంతసాగరం మండలాల అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : అంగన్‌వాడీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జిల్లా సిఐటియు అధ్యక్షులు టివివి ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళ వారం ఇందుకూరుపేట ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఇందుకూరుపేట ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసాద్, జిల్లా ఆటో కార్మిక సంఘం అధ్యక్షులు మారుబోయిన రాజాలు విచ్చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల అధ్యక్షులు మైపాటి కోటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు వెన్ను వేణు, ముత్తుకూరు, టిపి గూడూరు, ఇందుకూరుపేట మండలాల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకులు స్వర్ణలత, శారద, సుగుణమ్మ, మస్తానమ్మ, భాగ్యమ్మ, అనిత సుజానా, పద్మావతి, గీతాదేవి, సువార్తమ్మ, ఆటో యూనియన్ నాయకులు ఎస్‌కె చాన్‌బాషా, నాశిన పరుశురాం, దయాసాగర్, వాసు పెంచలయ్య, మాల్యాద్రి నరసింహ, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల ధర్నా జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

14, 15 తేదీలలో జరిగే ఆశా వర్కర్స్ 36 గంటల ధర్నాను జయప్రదం చేయాలని టివివి ప్రసాద్ కోరారు. మంగళవారం ఆశా వర్కర్లతో మైపాడు పిహెచ్‌సిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశావర్కర్లపై పని భారాన్ని పెంచి అదనపు పనులతో ఇబ్బందులకు గురి చేస్తుందని తెలిపారు. రూ.10వేల వేతనం ఇస్తున్నామన్నా పేరుతో 24గంటలు చాకిరీ చేయిస్తున్నారన్నారు. సిబ్బంది చేయాల్సిన అనేక రకాల పనులు బెదిరించి వేధించి ఆశాలతో పని చేస్తున్నారన్నారు. మొబైల్ వరకు ట్రైనింగ్ ఇవ్వకుండా 14 రకాల యాప్స్ ద్వారా పని చేస్తున్నారని గ్రామీణ ఏజెన్సీ ప్రాంతాలు నెట్‌వర్క్ లేకపోయినా ఫోన్లు పనిచేయకపోయినా ఆశా వర్కర్‌ను బాధ్యతలు చేస్తూ నిందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు చాన్‌బాషా, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కిష్టమ్మ, సుజాత, నిర్మల, తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వినతినిస్తున్న ఆశావర్కర్లు

ప్రజాశక్తి-అనంతసాగరం : ఆశావర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 14, 15న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే 36 గంటల ధర్నా కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి అన్వర్‌బాషా పిలుపునిచ్చారు. ఆశ వర్కర్ల సమస్యల ను పరిష్కరించాలని వైద్యాధికారి శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు ప్రమీల, ధనమ్మ, జ్యోతి, వసంత, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎంఎల్‌ఏ

ఆత్మకూరు నియోజకవర్గంలో నెలకొన్న భూ సమస్యలు వివిధ దశల్లో పరిష్కార దశలో ఉన్నాయని, వీటిని సత్వరమే పరిష్కరించి నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పరిష్కరించేలా చూడాలని కలెక్టర్ ఎం.హరి నారాయణన్‌ను ఆత్మకూరు ఎంఎల్‌ఏ మేకపాటి విక్రమ్ రెడ్డి కోరారు. మంగళవారం నెల్లూరు జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ఎం హరినారాయణన్‌తో కలిసి ఎంఎల్‌ఏ మేకపాటి విక్రమ్ రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గ రెవెన్యూ సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం గతంలో సమీక్షలు నిర్వహించినట్లు, ఆ సమీక్షల్లో తెలిపిన అంశాలపై ఆర్‌డిఓ, మండల తహశీల్దార్లు నివేదికలు అందజేశారన్నారు. వివిధ దశల్లో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తే రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. సమీక్షలో చర్చించిన సమస్యలపై వచ్చే సమీక్ష నాటికి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, ఆర్‌డిఓ మధులత, ఆత్మకూరు ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, తహశీల్దార్ జగదీష్, వైసిపి నాయకులు కర్రెడ్డి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌తోనే అభివృద్ధి

ప్రజాశక్తి-ఉదయగిరి : రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, తాగు, సాగునీరు కోసం ప్రాజెక్టులు నిర్మాణాలు పూర్తి కావాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డితోనే అవన్నీ సాధ్యమని మండల వైసిపి కన్వీనర్ ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వెంగళరావు నగర్ సచివాలయంలో కార్యదర్శి అమర్ నాథ్ రెడ్డి అధ్యక్షతన ప్రారంభమైన ఏపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వచ్చేప్పుడే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 2024 ఎన్నికల్లో బలమైన నమ్మకం ఉంచాలని తెలిపారు. పేద ప్రజల గుండెల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ఫిబ్రవరి నుండి చేపట్టే ఇంటింటి కార్యక్రమంలో జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు వివరించి ఎపికి జగనే ఎందుకు ముఖ్యమంత్రి కావాలని వివరించాలన్నారు. ముందుగా కార్యక్రమం బ్రోచర్లను ఆవిష్కరించి ఇంతవరకు సచివాలయ ద్వారా ప్రజలకు అందించిన 33 రకాల సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరించి అనంతరం వైసిపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఈశ్వరమ్మ ఎంఇఒ తోట శ్రీనివాసులు, సర్పంచ్‌లు మొంద్రు తిరుపతి, గొల్లపల్లి కల్పన, మాజీ మండల ఉపాధ్యక్షులు బాలుబోయిన శ్రీనివాసుల, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంట పొలాలు పరిశీలన

పంటలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మిచాంగ్ తుపాన్ ప్రభావంతో నష్టపోయిన వరి, ఉద్యానవన పంటలను వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి శారదా జయలక్ష్మి ఇందుకూరుపేట ఎడిఎ రాజ్ కుమార్‌తో కలిసి దెబ్బతిన్న పంట పొలాలను సందర్శించారు. మంగళవారం ఇందుకూరుపేట మండలంలోని డేవిస్‌పేట గమల్లపాలెం ప్రాంతాలలోని అరటి తోటలను, వరి పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ 2500 హెక్టార్ల మేర నారుదశలో ఉన్నాయని, 4500 హెక్టార్ల మీద వరి నాట్ల దశలో ఉన్నాయని అకాల తుపాను కారణంగా అవి పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు ప్రభుత్వం తరపునుంచి సబ్సిడీ విత్తనాలు తీసుకొని మళ్లీ నాట్లు వేయాలని సూచించారు. ఎడిఎ రాజ్ కుమార్, ప్రాంత వ్యవసాయ పరిశోధన సంస్థ ఎడిఆర్ సి రమణ, డాక్టర్స్ వినీత, శ్రీలక్ష్మి, పరమ శివం, మధు, శివ జ్యోతి, విజయ్ కుమార్, అగ్రికల్చర్ ఎఒ రఘునాథరెడ్డి, హార్టికల్చర్ ఎఒ ప్రసన్న, వ్యవసాయ పరిశోధకులు వెంకటేశ్వర్లు, స్థానిక విఎఎ తిరుమల రావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని ఇనమడుగు, తదితర ప్రాంతాల్లో ఇటీవల కురిసిన మిచాంగ్ తుపాన్ వల్ల దెబ్బతిన్న వరి, అరటి, తమలపాకు తోటలను మంగళవారం ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి డాక్టర్ శారదా జయలక్ష్మిదేవి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ సి.రమణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎంవీ సుబ్బారెడ్డిలు మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఉద్యానవన శాఖ అధికారి విశాల్, మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ వినీత, డాక్టర్ వెంకటేశ్వర్లు. తదితరులు ఉన్నారు.

జెబి గ్రౌండ్‌లో క్రీడా పోటీలు

ప్రజాశక్తి-కావలి

స్థానిక జవహర్ భారతి డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో మంగళ వారం ఘనంగా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల గేమ్స్ అండ్ స్పోర్ట్స్(మెన్ అండ్ విమెన్) పోటీలను స్థానిక ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రామిరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు, ఓటముల కన్నా, క్రమశిక్షణ, నిరంతర శ్రమ, క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని పిలుపు నిచ్చారు. వీటివల్ల జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చున్నారు. 1978-81 సంవత్సరాల లో ఇదే కళాశాలలో చదువుతూ, అనేక క్రీడలలో క్రీడాకారుడిగా అనేక క్రీడలలో రాణించి ఛాంపియన్‌గా నిలిచారన్నారు. దానికి ప్రధాన కారణం తన గురువులు నేర్పిన క్రమశిక్షణ ప్రధానమైందని వివరించారు. భారతదేశం క్రీడలలో అంతర్జాతీయంగా చాల వెనుకబడి ఉందని గుర్తించిన మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి క్రీడలకు ప్రోత్సాహం ఇవ్వాలని ఉద్దేశంతో "ఆడుదాం ఆంధ్రా" అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, దాంతో యువకులు చురుకుగా పాల్గొని, నిష్ణాతులై, దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకుని రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.సుధాకర్ రెడ్డి, క్రీడా పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ డా "ఆర్. మాల్యాద్రి రెక్టార్ డి.వినయకుమార్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.రాజగోపాలరెడ్డి, యూనివర్సిటీ అడ్వైసర్ డాక్టర్ జయకళ గొల్ల పాల్గొన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డా "పి. ప్రసాదరెడ్డి వందన సమర్పణ చేశారు.

గిడుగు రుద్రరాజును కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం

రుద్రరాజు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-ఉదయగిరి

దశాబ్దాల చరిత్ర గలిగిన కాంగ్రెస్ పార్టీకి పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అందించిన సేవలు అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత సోము అనిల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిసిసి అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టి ఏడాది దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా విజయవాడలో గిడుగును కలిసి ఆయన శుభాకాంక్షలు తెలిపామన్నారు. దానిని గుర్తించిన పార్టీ అధిష్టానం ఆయనకు పిసిసి బాధ్యతలు అప్పగించడం సంతోషకరమన్నారు. రుద్రరాజు క్రమశిక్షణ గలిగిన కార్యకర్తగా ఆయన వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లో పార్టీని బలోపేతం చేయడంలో ఆయన ఎంతగానో శ్రమిస్తున్నారని పార్టీని పటిష్టం చేయడానికి కూడా రుద్రరాజు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు సోనియా గాంధీ, యువనేత రాహుల్ గాంధీ సారథ్యంలో రుద్రరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో ఎపిలో పటిష్టం కావడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ఎపిలో పూర్వైభం రానుందని అనిల్ కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకున్నారని, కాంగ్రెస్ పార్టీ అయితేనే తమకు న్యాయం జరుగుతుందని ప్రజలు భావించి పట్టం కట్టడం జరిగిందన్నారు. ఇదే రీతిలో ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా ఆలోచన చేస్తున్నారని ఈ దేశానికి రాష్ట్రానికి సుస్థిర పాలన అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారని ఇది శుభ పరిణామమన్నారు. తెలుగు ప్రజల ఆశా కిరణం రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేసుకోవడమే ఆంధ్రుల ముందున్న లక్ష్యమని, ఆ దిశగా పార్టీ బలోపేతం కానుందని అనిల్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

'ఎడిఎఫ్'తో నియోజకవర్గ అభివృద్ధి

బస్సును ప్రారంభిస్తున్న మేకపాటి

ప్రజాశక్తి-మర్రిపాడు : నియోజక వర్గంలోని ప్రజల సహకారాలతో పార్టీలకు అతీతంగా అభివృద్ధే ధ్యేయంగా ఏర్పాటు చేసిందే ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం అని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధితో పాటు అందరం భాగస్వామ్యులై నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని చాబోలు గ్రామంలో దుత్తలూరు మోడల్ పాఠశాలకు వెళ్లే చాబోలు, వెంకటాపురం విద్యార్థుల సౌకర్యార్థం ఎడిఎఫ్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన బస్సును ఆయన మంగళవారం విద్యార్థులతో కలసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ప్రారంభించి సంవత్సరం రోజులు పూర్తయిందని, ఈ వేదిక ద్వారా నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమం గురించి ఏర్పాటు చేశామన్నారు. ఎడిఎఫ్ ద్వారా నియోజకవర్గంలోని ప్రజలకు విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పన, ఉద్యోగ అవకాశాల కోసం నైపుణ్యాభివృద్ధి, రైతాంగం కోసం అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. వీటన్నింటి అమలు కోసం నియోజకవర్గానికి చెందిన వారు బయట ఉంటూ వ్యాపారాలు, ఉద్యోగాలు నిర్వహిస్తున్న వారందరిని ఈ వేదికపైకి తీసుకు వచ్చామన్నారు. ఎడిఎఫ్‌లో భాగంగా ఇప్పటి వరకు రూ.18కోట్ల వరకు అందరి సహకారంతో అందజేశారని, ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ నిర్మాణం, సంగం ఐటిఐ కళాశాల, 100కు పైగా పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూముల ఏర్పాటు, ప్రతి పంచాయతీలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఇప్పటికే గుర్తించిన పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. మార్చిలోగా రూ.40 కోట్లు వరకు సహకారం అందిపుచ్చుకొని మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వెంకటాపురం, చాబోలు గ్రామాలలో ఉంటున్న విద్యార్థులు దుత్తలూరులోని మోడల్ పాఠశాలకు వెళ్లి చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్న సమయంలో బస్సు ఏర్పాటు చేయాలని కోరగా, డిఎఫ్ ద్వారా గ్రామస్తుల సహకారంతో బస్సు ఏర్పాటు చేశామని, దానికి అవసరమైన నెలవారీ ఖర్చులు గ్రామానికి చెందిన కృష్ణప్రసాద్, గ్రామస్తులు నిర్వహించేందుకు ముందుకొచ్చారని వివరించారు. ప్రజలందరూ ఎడిఎఫ్‌కు సహకారం అందించాలని కోరుతున్నామన్నారు. వైసిపి నాయకుడు దుగ్గిరెడ్డి కృష్ణప్రసాద్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కన్వీనర్ సుబ్బిరెడ్డి, వైసిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ చెవుల శ్రీనివాసులు యాదవ్, నందవరం, నందవరం సర్పంచ్ రామ్మోహన్, నాయకులు గంగినేని రవీంద్రబాబు, మల్లికార్జున్ యాదవ్, కల్లూరు జనార్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ అమర్‌నాథ్ రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లోనూ ఎపి అభివృద్ధి

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ విక్రమ్‌రెడ్డి

ప్రజాశక్తి-మర్రిపాడు : ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాలుగున్నర సంవత్సరాల్లో ప్రజలకు అందజేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులు, ఆర్థిక సంస్కరణలను, వీటి ద్వారా ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి సాధించిందని, ప్రతి వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంఎల్‌ఎ చాబోలు గ్రామంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ముఖ్యమంత్రి 2019-2023 వరకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలందరికీ వివరించే కార్యక్రమం వై ఎపి నీడ్స్ జగన్ ద్వారా ప్రతి ఇంటికి జగనన్న సంక్షేమాన్ని నాయకులు, కార్యకర్తలు వివరించారని తెలిపారు. ముఖ్యమంత్రి చేస్తున్న సంక్షేమ పథకాలు అందుకుంటున్న ప్రజలందరికి మరోమారు గుర్తు చేయాల్సిన అవసరం ఉందని, గతంలో ఉన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం 2019 నుంచి మన జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలందరికీ వివరించాలని, 2024లో మళ్లీ అధికారంలోకి వచ్చే విధంగా రానున్న మూడు నెలల కాలంలో అందరూ కష్టపడి పని చేయాలని సూచించారు. జగనన్న 2019లో ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని ప్రతి హామీని నెరవేర్చారని, ఈ నాలుగున్నర సంవత్సరాల కాలంలో విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు ఇలా ప్రతిఒక్క రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి అభివృద్ధి చేశారన్నారు. ప్రజల సంక్షే మం, అభివృద్ధి సాధించారని, ఆర్థిక సమస్యలు తలెత్తినప్పటికీ నాయకులు, కార్యకర్తలందరూ వెంట నడిచారన్నారు. వారందరికీ రానున్న ప్రభుత్వంలో జగనన్న అండగా నిలుస్తారని, ప్రతిఒక్కరూ మరింత ఉత్సాహంతో ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఉత్సాహపూరితంగా క్రీడలు నిర్వహించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మాట్లాడుతున్న ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్

క్రీడల్లో అందరూ పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని ఆత్మకూరు ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు. మంగళ వారం ఆడుదాం - ఆంధ్ర టోర్నమెంట్ నిర్వాహణకు సంబంధించి సచివాలయ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ తేదీ నుండి సచివాలయ పరిధిలో క్రికెట్, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ క్రీడా పోటీలు నిర్వహించవలసి ఉంది. కాబట్టి ప్రజా ప్రతినిధులు సహకారం తీసుకొని క్రీడలలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకున్న అందరూ పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని కోరారు. హైస్కూల్స్‌లో ఏర్పాటు చేసిన గ్రౌండ్స్ ఆటలకు అనువుగా ఉండే విధంగా చదును చేయాలని సూచించారు. గ్రామాలలో అందరికీ తెలియపరచి ఉత్సాహపూరిత వాతావరణంలో క్రీడలను నిర్వహించాలని సూచించారు. అందరూ సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు అందరినీ ఆహ్వానించి, తగిన ఏర్పాట్లు చేయించి టోర్నమెంట్ నిర్వహించాలని సూచించారు.

ప్రజా నాయకుడు ప్రసన్న

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : ప్రజానాయకుడు ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అని కొత్తూరు వైసిపి నేత కైలాసం శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎంఎల్‌ఎ పుట్టినరోజు సందర్భంగా కొత్తూరు గ్రామంలోని ఆయన నివాసం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కైలాసం మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా నిత్యం అందుబాటులో ఉండి ప్రజల కష్టాలను తీర్చే ఒకేఒక్క ఎంఎల్‌ఎ ప్రసన్నకుమార్ రెడ్డి అని కొనియాడారు. పెన్నా వరదల సమయంలో తుపాన్ సమయంలో ప్రసన్నకుమార్‌రెడ్డి సేవలు వెలకట్టలేనివని తెలిపారు. మండల ఉపాధ్యక్షురాలు కైలాసం లావణ్య, గంగపట్నం ఎంపిటిసి రమ్యశ్రీ, లేబూరు వెంకురెడ్డి, పూనమల్లి రామచంద్రయ్య, పత్తిపాటి శరత్, పెద పెంచలయ్య, వాకాటి మహేష్, వాకాటి ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-సంగం : సంగంలోని స్థానిక శివాజీ సెంటర్‌లో వైసిపి నాయకులు రఘునాథ్ రెడ్డి మంగళవారం సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పూజలు నిర్వహించి అనంతరం సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు, జెడ్‌పి నిధులతో కలిపి ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక శివాజీ సెంటర్ నుండి ఆంజనేయ స్వామి గుడి వరకు రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నో యేళ్లుగా సమస్యలతో ఈ రహదారి ఎంఎల్‌ఎ గడప గడపకు వచ్చినప్పుడు ప్రజలు అడిగిన వెంటనే ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో పిఆర్ ఎఇ రామయ్య, వైసిపి నాయకులు జనార్ధన్ రెడ్డి, పెరుమాళ్ల రవీంద్ర బాబు, రామారావు, శివ, మహేష్ పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్న ప్రభుత్వం ఉర్దూ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని సదుపాయాలతో కూడిన విద్య అందిస్తోందని ఉర్దూ పాఠశాలల తనిఖీ అధికారి షేక్ ఖాజా మొహిద్దీన్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్‌ఆర్‌పల్లి, అశ్వినిపురం, మహిమలూరు మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మేటివ్ అసెస్మెంట్ 1 పరీక్షలు జరిగే తీరును విద్యార్థుల సామర్థ్యాలను గమనించి ఉర్దూ పాఠశాలలలో ఉర్దూ భాషను అభివృద్ధి చేయాలని ఉపాధ్యాయులకు తెలిపారు.

జెడ్‌పిటిసి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనంతసాగరం : మండల జెడ్‌పిటిసి సభ్యులు రాపూరు వెంకటసుబ్బారెడ్డి జన్మదినం సందర్భంగా ఎంపిపి సంపూర్ణమ్మ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి అల్లంపాటి సుధాకర్ రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ అంకిరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్యుమెంటు పోయినది

వేలూరు మాలికేశ్వరి, తండ్రి వి.సుబ్రహ్మణ్యం, అన్నదేవులవారివీధి, మూలాపేట, నెల్లూరు -3, అను నేను నా ఒరిజినల్ రిజిష్టరు **దాక్యుమెంటు** నెం. **4624/1997** తేది: **25-11-2023** న నెల్లూరు మూలాపేట నుంచి ఇందుకూరుపేటకు ఇల్లు మారుతున్న సమయంలో సుమారు 2:30 గం॥ల ప్రాంతంలో మార్గమధ్యలో పోయినది. ఈ ఒరిజినల్ రిజిష్టరు డాక్యుమెంటు ఎవ్వరికైనా దొరికినయెడల దయచేసి ఈ సెల్ నెం.**99089 53944** కు సంప్రదించవలసినదిగా కోరుతున్నాను.

వేలూరు మాలికేశ్వరి, తండ్రి వి.సుబ్రహ్మణ్యం,
డోర్ నెం.24-1-241, అన్నదేవులవారివీధి,
మూలాపేట, నెల్లూరు -3.